సాక్షి ఖమ్మం

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



వృత్తి డాక్టర్.. ప్రవృత్తి సేవ

ఖమ్మంలో ఆస్పత్రి నెలకొల్పిన నాగేశ్వరరావు తన స్వగ్రామంతో పాటు మండలంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. 8లో



తెలంగాణ నేతలంటే అలుసు

తెలంగాణలోని ప్రజాప్రతినిధులంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి అలుసు అని ఖమ్మం ఎంపీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
40° / 23°

వాతావరణం

జిల్లాలో సోమవారం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఉదయమే ఎండ మొదలై మధ్యాహ్నం గరిష్ఠస్థాయికి చేరుతుంది.



న్యూస్‌రీల్

టీఎస్‌కేసీ ఆధ్వర్యాన రేపు జాబ్‌మేళా

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్(టీఎస్‌కేసీ) ఆధ్వర్యాన మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. పిరమిల్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తుండగా, 2022, 2023లో బీఏ, బీకాం, బీఎస్సీ 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం, ఆన్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ ఎన్.శ్రీనివాసరావును సంప్రదించాలని సూచించారు.

టన్నెల్ నిర్మాణానికి ఏడాది

సత్తుపల్లిరూరల్: సీతారామ ప్రాజెక్టులో కీలకమైన టన్నెల్ నిర్మాణ పనులు మండలంలోని యాతాలకుంట వద్ద ప్రారంభమయ్యాయి. రూ.58 కోట్ల అంచనా వ్యయంతో 1.75 కిలోమీటర్ల పొడవు, 5.25 మీటర్ల చుట్టు కొలతతో ఈ టన్నెల్ నిర్మించనున్నారు. ప్యాకేజీ - 9లో మొత్తం 19.23 కిలోమీటర్ల మేర కాల్వ నిర్మించనుండగా, ఇందులో భాగంగా టన్నెల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాగా, ప్రతీ 100 మీటర్లకు ఓ చోట బోర్ వేసి పరీక్షించగా, ఎక్కడా హార్డ్‌రాక్ లేకపోవడంతో టన్నెల్ నిర్మాణ పనులకు ఏడాది సమయం పడుతుందని భావిస్తున్నారు. ఈ పనులను ఆర్డీఓ సూర్యనారాయణ, ఇరిగేషన్ ఈఈ సురేష్, డీఈఈ చంద్రశేఖర్, ఏఈ నర్సింహారావు ఆదివారం పరిశీలించారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు జరిపేందుకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. అలాగే, ఈ - కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, పెండింగ్ డీఏలు కూడా ప్రకటించి నూతన పీఆర్‌సి కమిటీ నియమించాలన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 16వ తేదీన చేపడుతున్న ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి.మనోహర్‌రాజు, నాయకులు ముత్తయ్య, ప్రసాదరావు, పద్మ, వెంకటేశ్వర్లు, మల్లయ్య, ఏ.నాగేశ్వరరావు, ఎం.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నవమి ఆదాయం రూ.2.10 కోట్లు

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో ఈ ఏడాది నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణం, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకానికి వచ్చిన ఆదాయం లెక్క తేలింది. కల్యాణం సందర్భంగా దేవస్థానంలో నిర్వహించిన పలు రకాల సేవలకు సంబంధించిన టికెట్ల విక్రయం, విరాళాల రూపంలో రూ.2.10 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇందులో సెక్టార్ టికెట్ల ద్వారా రూ. 67.65 లక్షలు, ఉభయదాతల సేవల ద్వారా రూ. 51,37,100, రూ.10,64,500 ఆదాయం పట్టాభిషేకం ద్వారా, ప్రసాదాల అమ్మకంతో రూ. 60,60,050తో పాటు రూ.20,02,012, ఆన్‌లైన్ సేవల ద్వారా కలిపి రాగా.. మొత్తం రూ. 2,10,28,662 ఆదాయం నమోదైందని ఈఓ రమాదేవి వివరించారు. కాగా, 2021లో కోవిడ్ కారణంగా ఆలయంలో అంతర్గతంగానే కల్యాణం నిర్వహించారు. అయితే అప్పటికే ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంచడంతో వాటి ద్వారా రూ.2.34 కోట్ల ఆదాయం సమకూరింది. అంటే ఈ ఏడాది ఇంత ఘనంగా ఉత్సవాలు నిర్వహించినా.. 2021 కంటే తక్కువే ఆదాయం నమోదు కావడం గమనార్హం.

మండుతున్న భానుడు



- నానాటికీ పెరుగుతున్న ఎండ ప్రభావం
- జిల్లాలో 40 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రత
- గత ఏడాది కన్నా ఈసారి మరింతగా సూర్యప్రతాపం
- మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు

ఖమ్మంగాంధీచౌక్: భానుడు భగభగమంటున్నాడు. జిల్లాలో గతనెల చివరి నుంచి ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువలో ఉండగా.. గత ఏడాదితో పోలిస్తే ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఉదయం 9 గంటల నుంచే ఉష్ణోగ్రత మొదలై గంటగంటకూ పెరుగుతోంది. భానుడి ప్రతాపంతో ఉద్యోగాలు, పనులకు వెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్నం వేళ అందరూ కార్యాలయాలు, ఇళ్లకే పరిమితం అవుతుండడంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

గత నెల చివరి నుంచే...

మార్చి చివరి వారం నుంచే జిల్లాలో ఎండ తీవ్రత పెరుగుతోంది. మార్చి చివరి వారంలో 36 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈనెల ఆరంభం నుంచి మరికొంత పెరిగాయి. ఉష్ణోగ్రతల ప్రభావం రాత్రి వేళల్లో తగ్గుతున్నప్పటికీ ఉదయం నుంచే ఎండ తీవ్రత మొదలై సాయంత్రం వరకు ప్రభావం ఉంటోంది. గడిచిన నాలుగు రోజులుగా జిల్లాలో 37 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం గమనార్హం. ఈనెల 6వ తేదీన గరిష్ఠస్థాయిలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. మళ్లీ కాస్త తగ్గింది.

ఇబ్బంది పడుతున్న రైతులు, కూలీలు

యాసంగి పనులు కొనసాగుతున్న తరుణాన ఉష్ణోగ్రతలు పెరగటంతో రైతులు, కూలీలు ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల వరికోతలు, మొక్కజొన్న కోతలు, మిర్చి చివరి కోతల పనులు సాగుతున్నాయి.



ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా ఉన్న ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్

దీంతో ఎండలో కూలీలు రావడానికి ఇష్టపడకపోవడంతో పనివేళలను మార్చుకున్నారు. ఉదయాన్నే పనులకు వెళ్లి మధ్యాహ్నం కల్లా ఇళ్లకు చేరుతున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోనూ మిర్చి కొనుగోళ్ల పనులు, కాంటాలు మధ్యాహ్నం వరకు పూర్తిచేసుకుని.. తిరిగి సాయంత్రం తర్వాతే చేస్తున్నారు.

ఆదివారం జిల్లాలో 38 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

ఉష్ణోగ్రత (సెంటీగ్రేడ్లలో)	ప్రాంతం
39.7	కామేపల్లి
39.5	కూసుమంచి
39.5	ఏన్కూరు (తిమ్మారావుపేట)
39.2	ఖమ్మం అర్బన్ (ఖానాపురం)
38.9	ఖమ్మం రూరల్ (పల్లెగూడెం)
38.9	ముదిగొండ
38.2	ఖమ్మం అర్బన్ (ప్రకాష్‌నగర్)
38.2	సత్తుపల్లి (గంగారం)

పెరిగిన విద్యుత్ వినియోగం

ఇక ఎండ పెరగటంతో విద్యుత్ వినియోగం కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. గత నెల జిల్లాలో సగటున 6 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉండగా, ప్రస్తుతం ఏడు మిలియన్ యూనిట్లు దాటింది. వేడి నుంచి ఉపశమనం కోసం ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం పెరగడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. యాసంగిలో సాగు చేసిన పంటలకు నీటి తడి అవసరం ఉండడంతో విద్యుత్ వినియోగం పెరగడానికి కారణమవుతోంది.

దారులు వెలవెల 8లో

హ్యాట్రిక్ కొట్టడమే లక్ష్యం



సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన ప్రజాప్రతినిధులు, నాయకులు

- బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొద్దాం
- త్రీటౌన్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: పార్టీ కార్యకర్తలు సమష్టిగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మళ్లీ గెలిపించి హ్యాట్రిక్ సాధించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మం త్రీ టౌన్ కమిటీ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరగగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వాన బీఆర్‌ఎస్ కుటుంబీకులంతా పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు సిద్ధం కావాలని కోరారు. తెలంగాణలో అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష అని తెలిపారు. కేసీఆర్ నేతృత్వాన తెలంగాణ దేశంలోనే రోల్‌మోడల్‌గా నిలవగా.. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఖమ్మం చరిత్రలో నిలిచిపోయేలా మురికికూపంగా ఉన్న గోళ్లపాడు ఛానల్ ను ఆధునికీకరించగా దాదాపు 11 డివిజన్లలోని ప్రజలు మురుగు, దోమలు, అనారోగ్యం నుండి విముక్తులయ్యారని తెలిపారు. డివిజన్ల వారీగా చేసిన అభివృద్ధి పనులను వీడియో రూపంలో ప్రజలకు చేరవేయాలని మంత్రి పువ్వాడ సూచించారు.

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం..

కార్యకర్తలే బీఆర్‌ఎస్‌కు బలం.. బలగమని, వారే పార్టీకి బ్రహ్మాండమైన పునాదులని బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు అన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కార్యకర్తల భుజస్కంధాలపైనే ఉందని చెప్పారు. దేశంలోనే అన్ని అంశాల్లోనూ తెలంగాణ మొదటి స్థానంలో ఉందని కేంద్రం చెబుతున్నా... రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు మాత్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రధాని హైదరాబాద్ వచ్చి ఖమ్మం-దేవరపల్లి జాతీయ రోడ్డుకు శంకుస్థాపన చేశారని, తనకు పంపిన ఆహ్వానంలో తన పేరు కూడా లేదని నామ మండిపడ్డారు. అనంతరం నాయకులు, కార్యకర్తలకు మంత్రి పువ్వాడ స్వయంగా భోజనం వడ్డించి వారి తో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, సుడా చైర్మన్ బచ్చు విజయ్, మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు గుండాల కృష్ణ, చిన్ని కృష్ణారావు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో స్వామివారిని కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, స్వామివారి నిత్యకల్యాణంలో 166 జంటలు పాల్గొనడం విశేషం.



చందాలు, దందాలు ఉండవ్

- నా వాళ్లను ఇబ్బంది పెడితే ఊరుకోను
- అధికారులు చట్ట ప్రకారం పనిచేయాలి
- కొత్తగూడెం ఆత్మీయ సభలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రాష్ట్రమంతా ఖమ్మం వైపే చూస్తోంది : మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ చుంచుపల్లి: ఇకపై భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో చందాలు, దందాలు ఉండవని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని జిల్లాలోని ఓ ఎమ్మెల్యే, వారి కుటుంబసభ్యులు చేస్తున్న అరాచకాలు ఇకపై సాగవన్నారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమానులు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రం పరిధిలో సర్వే నంబర్ 137లో నివసిస్తున్న పేదలను ఓ ఎమ్మెల్యే తండ్రి బెదిరిస్తున్నాడని, ఇళ్లు కూల్చేస్తానంటూ ఇబ్బందులు పెడుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని అన్నారు. ఇకపై ఎవరి బెదిరింపులకు భయపడమని, ఏ ఒక్క ఇల్లు కూల్చినా బాధితుల తరఫున పోరాడేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగుతానని పొంగులేటి ఈ సందర్భంగా చెప్పారు.

చట్టబద్ధంగా పని చేయండి..

అధికారం ఎవరి సొత్తూ కాదని, ఐదేళ్ల తర్వాత అధికార, ప్రతిపక్షాల్లో మార్పులు వస్తుంటాయని పొంగులేటి అన్నారు. అందుకే ప్రభుత్వ ఉద్యోగులు అధికార పార్టీకి కొమ్ముకాయకుండా చట్టం, నిబంధనల ప్రకారం పని చేయాలని పొంగులేటి సూచించారు. అలా కాకుండా పోలీస్, రెవెన్యూ ఉద్యోగులు అధికార పార్టీ తొత్తుల్లా వ్యవహరిస్తూ తమను ఇబ్బంది పెట్టాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సభకు మరింత మంది ప్రజాప్రతినిధులు రావాల్సి ఉందని, కానీ ప్రభుత్వ ఒత్తిళ్ల వల్ల రాలేకపోయారని అన్నారు. అయితే సమయం వచ్చినప్పుడు ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరుతాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేటీపీఎస్‌లో ఉద్యోగులకు పీఆర్‌సీలు లేవని, ఆర్టిజన్ ఉద్యోగులను పర్మనెంట్ చేయడం మరిచారని విమర్శించారు.

ఇక్కడి నుంచే మార్పు

ఉమ్మడి ఖమ్మం జిల్లా వైపు రాష్ట్రం మొత్తం చూస్తోందని, ఇక్కడి నుంచే మార్పునకు నాంది పడుతుందని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆత్మీయ సభలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పదికి పది సీట్లలో శ్రీనివాసరెడ్డి తరఫున అభ్యర్థులను గెలిపించి ఉద్యమకారులకు బహుమతిగా ఇవ్వాలని జిల్లా ప్రజలను కోరారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అణచివేతకు గురవుతున్న తరుణంలో పొంగులేటి గళం విప్పారని, అందుకే తాను అంతదూరం నుంచి కొత్తగూడెం వచ్చానని చెప్పారు. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపుతున్న శ్రీనివాసరెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. ఉద్యమ సమయంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.1000 కోట్లు ఆఫర్ చేసినా తిరస్కరించి ఉద్యమంలో భాగమయ్యానని జూపల్లి తెలిపారు. అయితే తెలంగాణ వచ్చిన తర్వాత ఉద్యమకారులకు సరైన గౌరవం దక్కడం లేదన్నారు. పొంగులేటి వెంట నడుస్తున్న సర్పంచ్‌లకు బిల్లులు మంజూరు చేయకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు.

పొంగులేటి వెంటే మా ప్రయాణం

పేదలకు అండగా నిలుస్తూ ముందుకు సాగుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటే తమ ప్రయాణమని భద్రాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎమ్మెల్యేలు, ఎంపీలు పేరుకే ఉన్నారని.. కానీ ఎలాంటి పదవి లేకున్నా పొంగులేటి ప్రజాసేవలో ముందుకెళ్తున్నారని చెప్పారు. ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీబీ డైరెక్టర్లు తుళ్లూరి బ్రహ్మయ్య, మేకల మల్లిబాబు యాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబుతో పాటు నాయకులు విజయాబాయి, జారే ఆదినారాయణ, కోట రాంబాబు, నాయకులు బేబీ స్వర్ణకుమారి, ఊకంటి గోపాల్‌రావు, ఆళ్ల మురళి, తూము చౌదరి, నాగేంద్ర త్రివేది, పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లే కాక పెద్దసంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి తదితరులు

మిల్లర్ల మీనమేషాలు

- సీఎంఆర్ అప్పగింతలో నిర్లక్ష్యం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఆదేశాలూ బేఖాతర్
- అయినా పట్టించుకోని అధికార యంత్రాంగం
- నేడు హైదరాబాద్‌లో ముగ్గురు మంత్రుల సమీక్ష



ఖమ్మం సహకారనగర్: రైతులు పండించిన ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన రాష్ట్ర ప్రభుత్వం ఏటా కొనుగోలు చేస్తుంది. ఆతర్వాత ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన మిల్లర్లకు అప్పగిస్తుండగా సీజన్ ఆధారంగా సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)గా ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ బియ్యం అప్పగించటంలో మిల్లర్లు మీనమేషాలు లెక్కిస్తుండగా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఏటా ఇదే పరిస్థితి నెలకొంటున్నా ప్రభుత్వం గడువు పొడిగిస్తుండడం, ఆ గడువులోగా కూడా అధికారులు బియ్యం సేకరించలేకపోతుండడం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది.

గడువు ముగిసినా...

2021-22ఖరీఫ్, రబీకి సంబంధించి సీఎంఆర్ అప్పగించే గడువు ఏనాడో ముగిసింది. అయినా ప్రభుత్వం పెంచుతూ వెళ్తుండగా, 2021-22రబీకి సంబంధించి మార్చిలో ముగిసినా గడువు మాత్రం పొడిగించలేదు. ఇక 2022-23ఖరీఫ్‌కు సంబంధించి జూన్ వరకు గడువు ఉన్నా కనీసం 30శాతం సీఎంఆర్ కూడా మిల్లర్లు ఇప్పటికీ అప్పగించలేదు. ఇందులో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుండగా.. అధికార యంత్రాంగం మాత్రం ఎఫ్‌సీఐ తీసుకోవడంలో జాప్యం చేస్తోందని చెబుతుండడం గమనార్హం. కాగా, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సుమారు మూడు నెలల క్రితం హైదరాబాద్‌లో ధాన్యం నిల్వలపై జిల్లాల వారీగా సమీక్షించారు. గడువులోగా సీఎంఆర్ సేకరించకపోతే అధికారులనే బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. దీంతో అప్పట్లో కొద్దిరోజులు హడావుడి చేసిన అధికారులు ఆతర్వాత మళ్లీ చల్లబడ్డారు.

నేడు ముగ్గురు మంత్రుల సమీక్ష

మిల్లుల్లో ఉన్న ధాన్యం నిల్వలు, ప్రభుత్వానికి సీఎంఆర్‌గా ఇవ్వాల్సిన అంశంపై సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఆర్థిక శాఖమంత్రి తన్నీరు హరీశ్‌రావు సమీక్షించనున్నారు. జిల్లాల అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖాధికారులు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్లను ఈసమావేశానికి హాజరుకావాలని సూచించారు. ఈసమావేశంలో గతంలోని సీఎంఆర్‌పై సమీక్షించడమే కాక ప్రస్తుత యాసంగిలో రైతులు సాగు చేసిన ధాన్యం కొనుగోళ్లపై సూచనలు చేసే అవకాశముంది.

ఏడాదైనా సీఎంఆర్ రాలే...

జిల్లాలోని 21 మండలాల పరిధిలో 64మిల్లులు ఉన్నాయి. ఇందులో రా రైస్ మిల్లులు 57, బాయిల్డ్ మిల్లులు ఏడు ఉండగా, వీటన్నింటికీ ధాన్యం అందించి సీఎంఆర్‌గా సేకరిస్తుంటారు. ధాన్యం తీసుకున్న మూడు నెలల్లోగా స్థానిక పరిస్థితుల ఆధారంగా ఎఫ్‌సీఐ లేదా సివిల్ సప్లయీస్ శాఖకు సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఆ పరిస్థితి కానరావడంలేదు. 2021-22వ సంవత్సరం వానాకాలం(ఖరీఫ్)లో రైతుల నుంచి 2,78,535.040మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 67శాతం ముడి బియ్యంగా 1,86,618.058 మె.టన్నులను ఏప్రిల్‌లోగా ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం గడువు పెంచుతూ వెళ్లినా ఫలితం లేకపోవడంతో గతేడాది డిసెంబర్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో కొద్దిమేర బియ్యం సేకరించారు. ధాన్యం అప్పగించి ఏడాది దాటినా ఇంకా 361.874 మెట్రిక్ టన్నుల బియ్యంను మిల్లర్లు ఇవ్వకున్నా అధికార యంత్రాంగం నిర్లిప్తతతకు నిదర్శమని చెబుతున్నారు.

- 2021-22 రబీలో రైతులు సాగు చేసిన ధాన్యం కొనుగోళ్లను వివిధ కారణాల నేపథ్యంలో ఆలస్యంగా మొదలుపెట్టారు. రైతుల నుంచి 73,967మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా.. ఇందులో 67శాతం అంటే 49,765.442 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు 39,407.450 మెట్రిక్ టన్నులు ఇవ్వగా ఇంకా 10,357.992 మె.టన్నులు ఇవ్వాల్సి ఉంది.
- 2022-23 ఖరీఫ్‌కు సంబంధించి 2,79,293.480మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మిల్లులకు 5424.600 మెట్రిక్ టన్నులు, సూర్యాపేట జిల్లాకు 1275.920మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేటాయించారు. ఇక జిల్లాలోని మిల్లులకు 2,72,592.960మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా, 1,82,637 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందాల్సి ఉంది. కానీ ఇందులో 54,510 మెట్రిక్ టన్నుల బియ్యం ఇచ్చిన మిల్లర్లు.. 1,28,127.283మెట్రిక్ టన్నుల బియ్యం బాకీ పడ్డారు.

సీఎంఆర్ త్వరలోనే సేకరిస్తాం..



జిల్లాలో 2021-22 వానాకాలం, రబీ సీజన్లకు సంబంధించి ధాన్యం సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాం. 2022-23 వానాకాలానికి సంబంధించి సీఎంఆర్ సేకరణ గడువు జూన్ వరకు ఉంది. జిల్లాలో పెండింగ్ ఉన్న సీఎంఆర్‌ను త్వరలోనే పూర్తిస్థాయిలో సేకరిస్తాం.

– సోములు, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ

ఎఫ్‌సీఐ వాళ్లు తక్కువ తీసుకుంటున్నారు



బియ్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోవడంలో కొంత జాప్యం జరుగుతోంది. ఈ కారణంగా సీఎంఆర్ సేకరణలో ఆలస్యమవుతోంది. రోజుకు 2,500మెట్రిక్ టన్నుల బియ్యం తీసుకునే అవకాశమున్నా ఎఫ్‌సీఐ మాత్రం 1,100మెట్రిక్ టన్నులకు మించి తీసుకోవడం లేదు.

– రాజేందర్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ



సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసీం, పక్కన జయరాజు తదితరులు

ముదిగొండ: మండలంలోని ముత్తారంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ప్రొఫెసర్ ఖాసీం, ప్రజాకవి జయరాజు ఈ విగ్రహాన్ని ఆవిష్కరించగా ఖాసీం మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అందరూ ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. అనంతరం అంబేడ్కర్‌పై ప్రజాకవి జయరాజు రాసిన పాటను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎల్.శ్రీను, ఎల్.నర్సింహారావు, ప్రభాకర్‌రావు, రాములు, ఎంఎస్‌ఎఫ్ నాయకుడు దేవేంద్రప్రసాద్, అంబేడ్కర్ విగ్రహ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు అద్దాలు ధ్వంసం

కూసుమంచి: మండలంలోని జుజుల్‌రావుపేటలో నిలిపి ఉంచిన పాఠశాల బస్సు అద్దాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టారు. కూసుమంచిలోని గ్లోబల్-రెయిన్‌బో పాఠశాల బస్సులో పిల్లలను శనివారం సాయంత్రం దింపాక గ్రామంలోనే నిలిపారు. ఈక్రమంలో రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అద్దాలను ధ్వంసం చేయగా, ఆదివారం ఉదయం పాఠశాల కరస్పాండెంట్ ఇర్షాద్ అహ్మద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సింగరేణి సీనియర్ పీఓకు డాక్టరేట్



ప్రవీణ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయం సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్ లభించింది. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఆయన 'స్టడీ ఆన్ ఆర్గనైజేషనల్ కల్చరల్ ఎఫెక్టివ్‌నెస్ ఆఫ్ సెకండరీ స్కూల్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది.

ఆన్‌లైన్ మోసంపై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రామచంద్రయ్యనగర్‌కు చెందిన బ్యాంక్ ఉద్యోగి ఆన్‌లైన్ మోసంపై చేసిన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఉద్యోగి ఎస్.వెంకటసుబ్బరాజు ఆన్‌లైన్‌లో తమ బంధువులకు మిషన్ ఆర్డర్ చేయగా, డెలివరీ చేస్తామని చెబుతూ ఓటీపీ తెలుసుకున్న వ్యక్తులు ఖాతా నుంచి రూ.11,901 మినహాయించుకున్నారు. అయితే, మిషన్ ఆయనకు చేరకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం రుద్రాక్షపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సదరు వ్యక్తి వ్యక్తి ద్విచక్రవాహనంపై సత్తుపల్లి నుంచి బుగ్గపాడు వైపు వెళ్తుండగా రుద్రాక్షపల్లి వద్ద గేదెలు అడ్డొచ్చాయి. దీంతో ఆయన బండి అదుపు తప్పడంతో ఇస్తావత్ సీతారాములును ఢీకొని సమీపంలోని ఇంటి ప్రహరీని ఢీకొట్టగా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

నేలకొండపల్లి: రహదారి వెంట వెళ్తుండగా బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మండలంలోని కోరట్లగూడెంకు బచ్చలకూరి ఉపేందర్(18) తన స్నేహితులతో కలిసి గత సోమవారం రాత్రి కూసుమంచి-నేలకొండపల్లి ప్రధాన రహదారిపై వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్ వేగంగా వచ్చి వెనక నుంచి ఢీకొట్టాడు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన ఉపేందర్‌ను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా ఆదివారం మృతి చెందాడు. ఈఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.స్రవంతి తెలిపారు. కాగా, ఉపేందర్ మృతదేహం వద్ద టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెత్రిపోతుల అంజిని తదితరులు నివాళులర్పించారు.

వృత్తి డాక్టర్.. ప్రవృత్తి సేవ

- తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసిన డాక్టర్ నాగేశ్వరరావు
- స్వగ్రామమైన కేసుపల్లితో పాటు మండలంలో సేవా కార్యక్రమాలు
- ఇరవై ఏళ్లుగా కొనసాగుతున్న సామాజిక సేవ



నాగేశ్వరరావు ఆధ్వర్యాన కేసుపల్లిలో ఏర్పాటుచేసిన గ్రంథాలయం

ఏన్కూరు: ఏ స్థాయికి ఎదిగిన ఉన్న ఊరు, కన్న తల్లిదండ్రులను మరవొద్దనే పెద్దల సూచనలకు తూచా తప్పకుండా పాటిస్తున్నారు ఈ డాక్టర్. ఖమ్మంలో గ్యాస్ట్రో, లివర్ సెంటర్ వైద్యుడైన శెట్టిపల్లి నాగేశ్వరరావు అటు వైద్యంలోనే కాక ఇటు సామాజిక సేవలోనూ తన వంతు పాత్ర పోషిస్తున్నారు. ఏన్కూరు మండలం కేసుపల్లికి చెందిన ఆయన గ్రామాభివృద్ధి కోసం తల్లిదండ్రులు నారాయణ – బసవమ్మ మెమోరియల్ పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి ఇరవై ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామంలో గ్రంథాలయం, ఇంటింటికీ తాగునీరు, విద్యార్థులకు ట్యూషన్ సెంటర్ ఏర్పాటు చేసి సొంత నిధులతో ట్యూటర్‌కు వేతనాలు చెల్లిస్తున్నారు.

కేసుపల్లిలో పుట్టి..

ఏన్కూరు మండలంలోని కేసుపల్లిలో నిరుపేద రైతు కుటుంబానికి చెందిన నాగేశ్వరరావు ఖమ్మంలో గ్యాస్ట్రో అండ్ లివర్ సెంటర్ ఏర్పాటు చేసి ఎందరికో నామమాత్రపు ఫీజుతో వైద్యం అందిస్తున్నారు. ఈక్రమంలోనే గ్రామాభివృద్ధికోసం గ్రంథాలయం ఏర్పాటుచేయడమే కాక ఇంటింటికి తాగునీరు అందించేందుకు బోర్ వేయించాడు. అలాగే, గ్రామంలో ఇంటింటా మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, పాఠశాల అభివృద్ధి, తూతకలింగన్నపేట నుండి కేసుపల్లి వరకు రోడ్డు కిరువైపులా నాటించారు. అంతేకాక గ్రంథాలయం, తాగునీటి బోర్ వేయించి అప్పటి కలెక్టర్ ఎస్.నాగేశ్వరావు, ఎస్పీ అనిల్‌కుమార్‌తో ప్రారంభించగా వారు అభినందించారు.



కేసుపల్లిలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న అప్పటి కలెక్టర్ నాగేశ్వరావు (ఫైల్)

నాగేశ్వరావు చేపట్టిన సేవాకార్యక్రమాలు ..

కేసుపల్లిలో గ్రంథాలయం ఏర్పాటుచేయడమే కాక ప్రతిరోజు దినపత్రికలు వేయిస్తున్నారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించడమే కాక కుర్చీలు, బల్లలు సమకూర్చారు. ఇంకా చెరువు అభివృద్ధి, తూముల నిర్మాణం, పూడికతీత తీయించారు. తూతకలింగన్నపేట నుండి కేసుపల్లి వరకు రోడ్డుకిరువైపులా మొక్కల నాటించడమే కాక గ్రామంలో తరచుగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. అలాగే, పెద్దల కోసం వయోజనవిద్య కేంద్రం, విద్యార్థులకు ట్యూషన్ సెంటర్ ఏర్పాటుచేయించిన ఆయన.. రెండేళ్లుగా గ్రామంలో మద్యనిషేధం అమలుకు కృషి చేస్తున్నారు. ఏన్కూరు పీహెచ్‌సీలో విద్యుత్ సౌకర్యం కల్పించి ఫ్రిజ్, ఇతర సామగ్రి సమకూర్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలకు లక్ష కొబ్బరి, పండ్ల మొక్క లుపంపిణీ చేయించి స్థానికుల మన్ననలు అందుకుంటున్నారు



విద్యార్థులు ట్యూషన్ చెబుతున్న ట్యూటర్

డాక్టర్ సేవలు అభినందనీయం



డాక్టర్ నాగేశ్వరావు మా గ్రామంలో పుట్టినందుకు సంతోషంగా ఉంది. గ్రామస్తులు వైద్యం కోసం వెళ్తే ఉచితంగా సేవలు అందిస్తున్నారు. గ్రామంలో ప్రజలకు ఉపయోగపడేలా అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఇంటింటా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడమే కాక తాగునీటి కోసం బోర్, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు.

– బానోతు నాగమణి, సర్పంచ్, కేసుపల్లి

వైద్యంతో పాటు సామాజిక సేవ



వైద్య సేవలతో పాటు సామాజిక సేవ చేస్తున్న నాగేశ్వరావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలి. మా గ్రామానికి 600 మొక్కలు ఇచ్చారు. వైకుంఠధామంలో 200 కొబ్బరి మొక్కలు, పండ్ల మొక్కలు సమకూర్చారు. తరచుగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి మండలంలోని నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు.

– ఇంజం శేషయ్య, సర్పంచ్, నూకలంపాడు

సామాజిక సేవ కొనసాగిస్తా..



ఉన్న ఊరుకి సేవచేయడం ఆనందంగా ఉంది. తల్లిదండ్రుల పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేసి ఉన్న ఊరికి ఉచిత వైద్యంతో పాటు గ్రామాభివృద్ధికి నా వంతుగా కృషి చేస్తున్నాను. మనషులతో పాటు ప్రకృతి బాగుండాలని మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాను. అందరు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతిని కాపాడుకోవాలి. వైద్యసేవలతో పాటు సామాజిక సేవలు కొనసాగిస్తాను.

– డాక్టర్ శెట్టిపల్లి నాగేశ్వరావు

మా బిడ్డకు బతుకునివ్వండి..

- బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న బాలుడు
- దాతల సాయం కోసం తల్లిదండ్రుల వేడుకోలు
- ఆరు నెలల క్రితమే ఓ కుమారుడి మృతి

కన్నీటి వ్యథ

పెనుబల్లి : ఇద్దరు కుమారులు, భార్యతో సంతోషంగా సాగుతున్న ఆర్‌ఎంపీ వైద్యుడి కుటుంబం కుదుపునకు గురైంది. ఆరు నెలల క్రితం ఓ కుమారుడు బ్రెయిన్ ట్యూమర్‌తో మృతి చెందగా.. ఆ విషాదం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఇంతలోనే ఇంకో కుమారుడికి కూడా బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు తేలడంతో ఆ కుటుంబం తల్లాడిపోతుంది. చికిత్స చేయించే స్థోమత లేనందున దాతలు చేయూతనివ్వాలని బాలుడి తల్లిదండ్రులు కనిపించిన వారినల్లా వేడుకుంటున్నారు.

పొలం అమ్మినా ప్రాణం దక్కలే..

పెనుబల్లి మండలం గంగదేవిపాడుకు చెందిన ఆర్‌ఎంపీ సానిక చెన్నారావు – వనజ దంపతులకు 12, 10ఏళ్ల కుమారులు అభిషేక్, క్రిస్టోఫర్ ఉన్నారు. పెద్ద కుమారుడు అభిషేక్‌కు బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు గత ఏడాది మార్చిలో తేలగా వైద్యం చేయించారు. ఇందుకోసం ఉన్న అర ఎకరం పొలం అమ్మడంతో అప్పులు చేసి రూ.10 లక్షలు వెచ్చించినా అభిషేక్ వారికి దక్కలేదు. అయితే, హైదరాబాద్ వైద్యులు సూచనతో చిన్నకుమారుడు క్రిస్టోఫర్‌కు గత ఏడాది సెప్టెంబర్‌లో వైద్య పరీక్షలు చేయించగా ఆయన కూడా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయింది. అప్పటి నుంచి ఆర్‌ఎంపీగా వస్తున్నఅరకొర డబ్బుకు తోడు అప్పులు చేస్తూ హైదరాబాద్, బెంగుళూరు తదితర ప్రాంతాల్లో క్రిస్టోఫర్‌కు చెన్నారావు దంపతులు చికిత్స చేయిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స ఉన్నప్పటికీ సుమారు రూ.5 లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో ఏం చేయాలో తెలియక దిక్కులు చూస్తున్నారు. ఈ చికిత్స ఆరోగ్యశ్రీ పరిధిలోనూ లేకపోవడంతో దాతలు ముందుకు వచ్చి తన కుమారుడికి ప్రాణదానం చేయాలని తల్లిదండ్రులు వేడుకొంటున్నారు.



బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న క్రిస్టోఫర్‌తో చెన్నారావు - వనజ

చేయూత ఇవ్వాలనుకుంటే...

చెన్నారావు బ్యాంక్ అకౌంట్ నంబర్
635202010015892
యూనియన్ బ్యాంకు ఐఎఫ్‌సీ కోడ్ :
యూబీఐఎన్ 0563528 లేదా
గూగుల్ పే, ఫోన్ పే ద్వారా
96033 96988 నంబర్‌కు
నగదు పంపించవచ్చు.

చిన్నారి వైద్యానికి రూ.7 లక్షలు

తల్లాడ: మండలంలోని నారాయపురం గ్రామానికి చెందిన రాచమల్ల శివ – తేజ కుమార్తె ఆద్య పుట్టుకతోనే అంధురాలు కాగా, వైద్యం కోసం ఏ ఆస్పత్రికి వెళ్లినా నయం కాలేదు. హైదరాబాద్‌లో మెరుగైన వైద్యం అందుతుందని తెలిసి సంప్రదించగా పెద్దమొత్తంలో ఖర్చవుతుందని చెప్పడంతో ఆందోళనకు గురాయ్యారు. ఈ నేపథ్యాన పాప వైద్యం కోసం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.7లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం ఆయన పాప తల్లిదండ్రులకు ఆయన ఎల్‌ఓసీ అందజేయగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ సొసైటీ అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, నాయకులు దూపాటి భద్రరాజు, దుగ్గిదేవర వెంకట్‌లాల్, శీలం కోటారెడ్డి, గుండ్ల వెంకటేశ్వర్లు, దగ్గుల శ్రీనివాస రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, టి.రఘు, సంఘసాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

అంతా నిద్రిస్తుండగా చోరీ

- 11 తులాల ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదు మాయం

కొణిజర్ల: కొణిజర్లలోని ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. శనివారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ గాఢనిద్రలో ఉన్న సమయాన చొరబడిన దొంగలు 11 తులాల బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. కొణిజర్ల ఎస్‌ఐ జె.శంకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కొణిజర్లకు చెందిన తుప్పతి వెంకన్న, హేమ దంపతులు శనివారం రాత్రి ఇంటి బయట నిద్రించగా, వీరి కుమారుడు, కోడలు నరేష్ – రేషిక ఇంట్లోని బెడ్‌రూమ్‌లో నిద్రించారు. తెల్లవారుజామున వెంకన్న భార్య లేచి ఇంట్లోకి వెళ్లగా బెడ్‌రూమ్ తలుపులతో పాటు బీరువా తలుపులు తీసి వస్తువులన్నీ చిందరవందరగా ఉండడంతో భర్త వెంకన్న, కుమారుడు నరేష్‌ను నిద్ర లేపింది. వారు పరిశీలించగా బీరువాలో దాచిన నగలు, నగదు లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు కొణిజర్ల పోలీసులు ఖమ్మం నుంచి క్లూస్‌టీమ్ సభ్యులను పిలిపించి విచారణ చేపట్టారు. ఇటీవలే ఇంట్లో శుభకార్యం జరగగా, తీసుకొచ్చిన 11 తులాల బంగారు, వెండి ఆభరణాలు, రూ.లక్షల చోరీ జరిగినట్లు బాధితులు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శంకరరావు తెలిపారు. కాగా, పదిహేను రోజుల వ్యవధిలో నాలుగుచోట్ల దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు.

జాతర ఊరేగింపులో అపశ్రుతి

కారేపల్లి: మండల కేంద్రంలోని శ్రీగురువమ్మతల్లి జాతర శనివారం మొదలుకాగా, ఆదివారం రాత్రి వరకు అంగరంగ వైభవంగా సాగింది. శనివారం రాత్రి శ్రీగురువమ్మతల్లి, సర్వారెడ్డి దేవతామూర్తుల కల్యాణోత్సవం అనంతరం ఉత్సవ విగ్రహాల ఊరేగింపునకు ఎడ్ల బండ్లను సిద్ధ చేశారు. ఈ వేడుకను తికించేందుకు వేలాదిగా భక్తులు హాజరుకాగా, ఎడ్ల బండిపైకి ఉత్సవ విగ్రహాలను చేర్చే క్రమంలో బెదిరిన ఎడ్లు పరుగులు తీశాయి. దీంతో జనం కూడా పరుగులు తీస్తుండడంతో తోపులాట జరగగా పేరుపల్లికి చెందిన మేడ శ్రీనుతో పాటు మరో మహిళకు గాయాలైయ్యాయి. అప్రమత్తమైన ఆలయ కమిటీ సభ్యులు, యువకులు ఎడ్లను అదుపు చేయటంలో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు. అనంతరం మరో జత ఎడ్లను కట్టి ఊరేగింపు నిర్వహించారు. ఇదేసమయాన రెండు గ్రూపుల మధ్య గొడవ జరగగా పరస్పరం దాడులకు పాల్పడ్డారు.



పశువుల భయంతో పరుగు తీస్తున్న భక్తులు

అమ్మవారి దర్శనానికి వెళ్తుండగా..

అశ్వారావుపేటరూరల్: అమ్మవారి దర్శనానికి వెళ్తున్న భక్తుల వాహనం బోల్తా పడి 30 మందికి గాయాలైన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం చిన్న నల్లకుంట గ్రామానికి చెందిన 40 మంది గిరిజనులు టాటా ఏస్ వాహనంలో ఏపీ, తెలంగాణ సరిహద్దులో ఉన్న శ్రీ గుబ్బల మంగమ్మ తల్లి ఆలయానికి వస్తున్నారు. ఈ క్రమంలో అశ్వారావుపేట మండలం నారాయణపురం పంచాయతీ జగన్నాథపురం మూల మలుపు వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో 30 మంది గాయపడ్డారు. బాలరాజు, ముత్తమ్మ, అహల్య, వెంకటేశ్వర్లు, కమలకు తీవ్రగాయాలయ్యాయి. వీరితోపాటు నాలుగు నెలల పసికందు, నాగమణి, నవీన్, పుష్ప, రాజు, నాగమ్మ, రత్తమ్మ, పార్వతి, సునీత, రమణమ్మ, వాణి, వరమ్మ, నాగరాజు, సంధ్య, మాధవి తదితరులకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను చిట్టితల్లి సంస్థ అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి భద్రాచలం, కొత్తగూడెం ఆస్పత్రులకు తీసుకెళ్లారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, బీఆర్‌ఎస్ నాయకులు క్షతగాత్రులను పరామర్శించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.రాజేశ్ కుమార్ తెలిపారు. కాగా డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

కొత్త బట్టలు తీసుకెళ్తూ మృత్యుఒడిలోకి...

- రోడ్డు ప్రమాదంలో మామాఅల్లుడు మృతి
- ఖమ్మం, సూర్యాపేట జిల్లాల వాసులుగా గుర్తింపు

మరిపెడ రూరల్: ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి రోడ్డు వెంట ఉన్న సూచిక బోర్డును ఢీకొట్టిన ఘటనలో మామ, అల్లుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బుర్హాన్‌పురం శివారు పల్లె ప్రకృతి వనం వద్ద 365జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. మరిపెడ ఎస్సై పవన్‌కుమార్ కథనం ప్రకారం .. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంకు చెందిన బానోత్ రమేష్(50), తన కుమార్తె భర్త అయిన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం జగ్నా గ్రామానికి చెందిన పవన్(30)తో కలిసి కొత్త బట్టలు కొనుగోలు చేయడానికి బైక్‌పై మరిపెడకు వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో బుర్హాన్‌పురం శివారులో బైక్ అదుపు తప్పి సూచిక బోర్డును ఢీకొట్టింది. ఈ ఘటనలో రమేష్, పవన్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పెరిక సంఘాన్ని బలోపేతం చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పెరిక కులస్తులు ఐక్యంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దా లింగయ్య పిలుపునిచ్చారు. ఖమ్మం త్రీటౌన్‌లో ఆదివారం నిర్వహించిన పెరిక కుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం కావడమే కాక గుర్తింపు లభిస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గజవెల్లి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా బందు సూర్యం, ప్రధాన కార్యదర్శిగా చింతల లింగేశ్వరరావు, కోశాధికారిగా వెంకటేశ్వర్లుతో పాటు వివిధ పదవులకు ఈశ్వర్, గురవయ్య, కొండల్‌రావు, శ్రీనివాసరావు, చైతన్య, దామోదర్, చిత్తలూరి జయమ్మ, పత్తిపాక లత, సరళను ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో పుల్లయ్య, విజయకుమార్, వెంకటేశ్వర్లు, ఆనంద్, శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నాయకులు

పేకాటరాయుళ్ల అరెస్టు

ఇల్లెందు: పట్టణంలోని 15వ నంబర్ బస్తీలో పేకాట స్థావరంపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

భానుడి భగభగ.. దారులు వెలవెల

భానుడి భగభగకు ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. గత రెండు రోజులుగా ఎండ అధికంగా ఉన్నా... ఆదివారం భానుడు మరింత ఉగ్రరూపం చూపించాడు. ఉదయం 9గంటల నుంచే ఎండ మొదలై 11గంటలకల్లా తీవ్రత పెరిగింది. దీనికి తోడు ఆదివారం కావడంతో ఎప్పుడూ రద్దీగా ఉండే జిల్లా కేంద్రంలోని పలు కూడళ్లు, రహదారులు బోసిపోయి కనిపించాయి. – ఖమ్మం సహకారనగర్



నిర్మానుష్యంగా కనిపిస్తున్న నగరంలోని వైరా రోడ్డు



కమాన్‌బజార్ రోడ్డు



నగరంలోని పాత మున్సిపాలిటీ సెంటర్

క్లుప్తంగా...

రాష్ట్రంలో రాచరిక పాలన

ప్రశ్నించే స్వేచ్ఛ ఎమ్మెల్యేలకే లేదు: ఈటల రాజేందర్



వనపర్తి: ఎందరో ఆత్మబలిదానాలతో ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో రాజరిక పాలన సాగుతోందని బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. వనపర్తి జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీసీల ఆత్మగౌరవ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గతంలో తెలంగాణ ఫ్లోర్‌లీడర్‌గా అసెంబ్లీలో హక్కులు, అధికారాలు, ప్రజాధనం గురించి గద్దించి ప్రశ్నించే స్వేచ్ఛ ఉండేదన్నారు. కానీ ప్రస్తుత కేసీఆర్ పాలనలో మారుమూల గ్రామం నుంచి అసెంబ్లీ వరకు ప్రశ్నించే అవకాశం లేకుండా ఉక్కుపాదం మోపుతూ.. ప్రజాస్వామ్యం అనే పదాన్ని ఉచ్చరించకుండా చేస్తున్నారని విమర్శించారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో తాను గెలుపొందిన తర్వాత అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడేందుకు ప్రయత్నిస్తే.. సభ నుంచి బయటకు పంపించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో శాశ్వతంగా తామే అధికారంలో ఉంటామనే భ్రమలో బీఆర్ఎస్ నాయకులు అణచివేతకు పాల్పడటం తగదని ఈటల హెచ్చరించారు.

హక్కుల కోసం పోరాడిన జస్టిస్ చిన్నప్పరెడ్డి



మాడభూషి శ్రీధర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాపక్ష న్యాయమూర్తి జస్టిస్ ఓ.చిన్నప్పరెడ్డి శత జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా చిన్నప్పరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం మాజీ జాతీయ కమిషనర్, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో పని చేస్తూ ప్రజల హక్కుల కోసం నిలిచిన గొప్ప వ్యక్తి చిన్నప్పరెడ్డి అని కొనియాడారు. ఆయన ఎక్కడ పని చేసినా శ్రామికుల గొంతుకగా నిలిచారని గుర్తు చేశారు.తన సుదీర్ఘ అనుభవంలో ఎన్నో చారిత్రక తీర్పులు ఇచ్చిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి, సీనియర్ అడ్వొకేట్ ఎస్.సైదారావు, సీనియర్ జర్నలిస్టు ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సందడి



తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్టిక్కర్‌కు హారతులిస్తున్న మహిళలు

ఏపీ వ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, సమన్వయకర్తలు, కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు కలసికట్టుగా ఇంటింటికీ వెళ్తున్నారు. జగనన్న ప్రతినిధులుగా వచ్చిన వీరందరినీ.. తమ ఇంటికి బంధువులొచ్చినంత సంబరంగా ప్రజలు చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారు. 'ఎమ్మెల్యే వద్దకు ప్రజలు వెళ్లడం మామూలే.. అందుకు విరుద్ధంగా ప్రజల వద్దకే ఎమ్మెల్యే రావడం అంటే అది కేవలం ఒక్క జగనన్న వల్లే సాధ్యమైంది' అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ పలు విధాలా తమను ఆదుకుంటున్నారని, ఇలా ఆదుకుంటుండటం కొంత మంది పెత్తందారులకు గిట్టడం లేదని అక్కచెల్లెమ్మలు నేతల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

36% 'వంట' చెరకే!

దేశంలో వంటకు గ్యాస్ వాడకం 62 శాతం

- గ్రామీణ ప్రాంతాల్లో 46.7 శాతం కట్టెలు, వరిపొట్టు, పంట అవశేషాలతోనే
- ఛత్తీస్‌గఢ్‌లో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాల్లో 84.2 శాతం కట్టెలతోనే వంట
- ఉచితంగా వంట చెరకు లభించడం, గ్యాస్ ధరలు భగ్గుమనడం కారణాలు
- కేంద్ర పర్యావరణ గణాంకాలు 2023 నివేదికలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో 62 శాతం మంది వంట కోసం ఎల్పీజీ (గ్యాస్)ని వినియోగిస్తుండగా 36 శాతం ప్రజలు మాత్రం వంట చెరకునే వాడుతున్నట్లు కేంద్ర పర్యావరణ గణాంకాల నివేదిక వెల్లడించింది. 33.8 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై ఆధారపడుతుండగా 2.2 శాతం మంది వంట కోసం పిడకలను వినియోగిస్తున్నారు. 1.3 శాతం మంది కిరోసిన్, గోబర్ గ్యాస్, ఎలక్ట్రికల్, బొగ్గుల పొయ్యిపై వంట చేస్తున్నారు. ఇక ఎల్పీజీ వినియోగంలో గ్రామాలకు, పట్టణ ప్రాంతాలకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో కట్టెలు, పొట్టు, పంట అవశేషాలు ఉచితంగా లభిస్తుండటంతోపాటు బూడిదను పంట పొలాలకు ఎరువుగా వాడుతున్నందున వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ఇక భగ్గుమంటున్న గ్యాస్ ధరలు కూడా కారణమే. ఈమేరకు కేంద్ర పర్యావరణ నివేదిక 2023ని గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ విడుదల చేసింది.

- గ్రామీణ ప్రాంతాల్లో 49.4 శాతం మంది ఎల్పీజీ వాడుతుండగా 46.7 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై ఆధారపడుతున్నారు. మూడు శాతం మంది పిడకలు, 0.7 శాతం మంది గోబర్ గ్యాస్, కిరోసిన్, ఎలక్ట్రికల్, బొగ్గుల పొయ్యిలను వాడుతున్నారు.
- పట్టణ ప్రాంతాల్లో 89 శాతం మంది వంట కోసం ఎల్పీజీ వాడుతుండగా 6.5 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలను వినియోగిస్తున్నారు. 0.3 శాతం మంది పిడకలు, 2.5 శాతం గోబర్ గ్యాస్, ఎలక్ట్రికల్, కిరోసిన్, బొగ్గుల పొయ్యిలను వాడుతున్నారు.
- ఛత్తీస్‌గఢ్ గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా 84.2 శాతం మంది వంట కోసం కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపైనే ఆధారపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో 16.3 శాతం మంది కట్టెలు, పొట్టు, పంట అవశేషాలపై వంట చేస్తుండగా 81.7 శాతం మంది ఎల్పీజీ వినియోగిస్తున్నారు.

వందే భారత్ రైలులో ఏపీ సీఎస్ ప్రయాణం



తిరుపతి అర్బన్: వందే భారత్ రైలులో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి ప్రయాణించారు. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం తిరుపతి వచ్చిన ఆయన ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి రైల్వేస్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ శనివారం సికింద్రాబాద్‌లో వందే భారత్ ట్రైన్ ప్రారంభించడం శుభపరిణామమని తెలిపారు. యాత్రికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సీఎస్ జవహర్ రెడ్డి తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి వందే భారత్ రైలులో గుంటూరుకు వెళ్లారు. అక్కడ నుంచి విజయవాడకు వెళ్లనున్నారు. ఆయనకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, టీటీడీ జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మయ్య, నగరపాలక కమిషనర్ హరిత, స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ వీడ్కోలు పలికారు.

పొదుపు మహిళల 'అర్బన్ మార్కెట్లు'

స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేలా స్టాళ్లు



గత నెలలో విశాఖపట్నంలో నిర్వహించిన అర్బన్ మార్కెట్‌లోని స్టాళ్లు

- శ్రీకాకుళం, విశాఖలో 'మెప్మా' పైలెట్ ప్రాజెక్టు విజయవంతం..
- ఏపీలోని అన్ని పట్టణాల్లో ఏర్పాటుకు సన్నద్ధం

సాక్షి, అమరావతి: పట్టణ మహిళల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయంగా తయారు చేసే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేలా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'అర్బన్ మార్కెట్ల'ను ఏర్పాటు చేయనుంది. పైలెట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం, విశాఖలో నెలకొల్పిన అర్బన్ మార్కెట్లు విజయవంతం కావడంతో రాష్ట్రంలోని 123 కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఈ నెలలోనే వీటిని ఏర్పాటు చేయాలని మెప్మా నిర్ణయించింది. మెప్మా రెండేళ్ల క్రితం 7 నగరాల్లో ఏర్పాటు చేసిన 'జగనన్న మహిళా మార్టులు' విజయవంతం కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్తగా అర్బన్ మార్కెట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సిటీ మిషన్ మేనేజర్లకు(సీఎంఎం)మెప్మా ఎండీ ఆదేశాలు జారీ చేశారు. దుకాణాల ఏర్పాటుకయ్యే ఖర్చును మెప్మా చెల్లించనుంది. వీటిల్లో పొదుపు మహిళలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను విక్రయించుకునేలా ఏర్పాట్లు చేస్తారు. వైఎస్సార్ చేయూత, ఆసరాతోపాటు సున్నావడ్డీ రుణాలు తీసుకున్న పొదుపు సంఘాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా అర్బన్ మార్కెట్లను అందుబాటులోకి తెస్తున్నారు.

అద్భుతమైన అవకాశం

ఇంట్లో మసాలాలు, కారప్పొడులు లాంటి 26 రకాల పొడులు తయారు చేస్తుంటా. గతంలో తెలిసినవారికి, బంధువులకు మాత్రమే విక్రయించగా రూ.2 వేలు కూడా వచ్చేవి కాదు. ఇటీవల విశాఖలో అర్బన్ మార్కెట్‌లో రెండు రోజులు స్టాల్ నిర్వహించగా రూ.17 వేల మేర వ్యాపారం జరిగింది. కొత్త వినియోగదారులు పరిచయం కావడంతో ఆన్‌లైన్‌లో కూడా ఆర్డర్లు వస్తున్నాయి. అర్బన్ మార్కెట్ ద్వారా అనూహ్యంగా వ్యాపారం పుంజుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– జి.సత్యరాజ్యలక్ష్మి, విశాఖపట్నం ఎంటర్‌ప్రెన్యూర్

ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు

ఏపీలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణకు ఏర్పాట్లు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో పేరుకుపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలను (ఈ–వేస్ట్‌ను) పర్యావరణహితంగా తొలగించడంపై ఏపీ ప్రభుత్వం దృష్టిసారించింది. పాలనలో పారదర్శకత కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని సేవలను ఆన్‌లైన్ విధానంలో అందిస్తుండడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-వేస్ట్ భారీగా పెరిగిపోతుండటాన్ని సర్కారు గుర్తించింది. ఏటా ప్రభుత్వ కార్యాలయాల నుంచి వెయ్యి టన్నుల ఈ-వేస్ట్ ఉత్పత్తి అవుతున్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. కంప్యూటర్లు, ట్యాబులు, మొబైల్ ఫోన్లు, రూటర్లు, స్విచ్‌లు, వైర్లు వంటి వాటి కాలపరిమితి తీరిపోయి పనిచేయనివాటిని సేకరించి రీసైక్లింగ్, డిస్పోజబుల్ చేసేవిధంగా ఒక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ వేస్ట్ సేకరణకు నోడల్ ఏజెన్సీగా ఏపీ టెక్నాలజీస్ సర్వీసెస్ (ఏపీటీఎస్)ని నియమించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు ఈ–వ్యర్థాలను రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఈ–వ్యర్థాలను సేకరించి వాటిని తీసుకెళ్లి రీసైక్లింగ్, రీ-ఫర్బిషింగ్, డిస్పోజబుల్ చేసే బాధ్యతల్ని అప్పగించేందుకు ఏపీటీఎస్ టెండర్లు పిలిచింది. ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, కార్యాలయాలు, సంస్థల నుంచి ఈ–వేస్ట్ సేకరించే విధంగా కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు.

పూలే జయంతి ఉత్సవ కమిటీలో స్థానం



కంభం శివకృష్ణ

మధిర: రాష్ట్రప్రభుత్వం అధికారంగా నిర్వహించనున్న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవ కమిటీలో మండలంలోని మడుపల్లికి చెందిన కంభం శివకృష్ణకు స్థానం దక్కింది. ఈమేరకు ఆయన కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ బీసీల ఆశాజ్యోతి పూలే జయంతిని ఈనెల 11న ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తరపున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాసమస్యలపై ఎలుగెత్తిన నేత కానూరి



సభలో మాట్లాడుతున్న అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న

కొణిజర్ల: ప్రజా నాట్యమండలి సభ్యుడిగా ప్రజాసమస్యలపై ఎలుగెత్తి పోరాడిన విప్లవ నేత కానూరి వెంకటేశ్వరరావు అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పరకాల నాగన్న వెల్లడించారు. మండలంలోని రామనరసయ్యనగర్‌లో కానూరి వెంకటేశ్వరరావు ఎనిమిదో వర్ధంతి సభ శనివారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా నాగన్న మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యకు గురువైన వెంకటేశ్వరరావు అమరుడని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో నియంతల పాలన సాగుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బానోత్ కిషన్‌తో పాటు పి.విప్లవ్‌కుమార్, లక్ష్మి, ఖాసీంఖాన్, బాషా, శ్రీకాంత్, మహేష్, కిషోర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. పెద్దసంఖ్యలో వచ్చిన పర్యాటకులు డీర్ పార్కులోని దుప్పులతో పాటు డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించాక బోటు షికారు చేస్తూ సాయంత్రం వరకు గడిపారు. కాగా, కిన్నెరసానిలో ప్రవేశానికి టికెట్ల ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.21,925, బోటింగ్ ద్వారా టూరిజం శాఖకు రూ.17,160 ఆదాయం లభించింది.

జిల్లా వార్తలు

తెలంగాణ నేతలంటే బీజేపీకి అలుసు

- ప్రధాని కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘన
- ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు



నేలకొండపల్లి: సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ నాగేశ్వరరావు, పక్కన ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి తదితరులు

నేలకొండపల్లి: తెలంగాణ ప్రజాప్రతినిధులంటే బీజేపీకి అలుసుగా మారిందని బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు విమర్శించారు. నేలకొండపల్లిలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన పాలేరు నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం–దేవరపల్లి జాతీయ రహదారి పనులకు ప్రధాని మోదీ శనివారం పర్యటనలో శంకుస్థాపన చేయగా, ఆహ్వానపత్రికలో తన పేరు చేర్చలేదని పేర్కొన్నారు. తెలంగాణ బిడ్డలను చులకనగా చూస్తున్నారని ఇదే నిదర్శనమని తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ సిట్టింగ్‌లకే సీట్లు ఇస్తామని సీఎం కేసీఆర్ చెప్పినందున పాలేరు సీటుపై చర్చ అవసరం లేదని చెప్పారు. పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ వంటి మంచి మనస్సు నేతకు అధికారం ఇస్తే ఎంత అభివృద్ధి జరిగిందో చూస్తున్న ప్రజలు మరోమారు గెలిపించాలని కోరారు. ఆత్మీయ సమ్మేళనాల జిల్లా ఇన్‌చార్జ్ సుభాష్‌రెడ్డి, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వరరావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మితో పాటు నాగుబండి శ్రీనివాసరావు, ఇంటూరి శేఖర్, శాంత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న బీజేపీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): దేశానికి రోల్ మోడల్‌గా అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణకు అండగా నిలవకుండా స్వార్థ రాజకీయ ప్రయోజనాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఆరోపించారు. కొత్తగూడెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడరతూ సింగరేణిలో రాష్ట్రం వాటా 51 శాతం ఉన్నప్పుడు ఎలా ప్రైవేటీకరిస్తామని మాట్లాడిన ప్రధాని నరేంద్రమోడీ.. అందుకు భిన్నంగా బొగ్గు గనుల వేలానికి సిద్ధం కావడం ఏమిటో చెప్పాలన్నారు. భద్రాచలం – కొవ్వూరు రైల్వేలైన్ సమస్య 40 ఏళ్లుగా నలుగుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడంతో సింగరేణి చొరవతో తెలంగాణ సరిహద్దు వరకు లైన్ వేసుకోగలిగామని తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్రం నుంచి రూ.3.52 లక్షల కోట్లు తీసుకున్న కేంద్రం కేవలం రూ.81వేల కోట్లు మాత్రమే తిరిగి ఇచ్చిందన్నారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సింగరేణి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కాపు సీతాలక్ష్మితో పాటు దామోదర్, కె.ధర్మరాజు, బాదావత్ శాంతి, భూక్యా సోనా, లగడపాటి రమేష్, అన్వర్‌పాషా, నల్లమల వెంకటేశ్వరరావు, ఎం.ఏ.రజాక్, అనుదీప్ పాల్గొన్నారు.

అన్నింటి సమ్మిళితమే ఊరు కవిత్వం

మేడ్చల్ అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



సంపుటిని ఆవిష్కరిస్తున్న నర్సింహారెడ్డి, సాహితీవేత్తలు

ఖమ్మంగాంధీచౌక్: రంగు, రుచి, వాసన, స్పర్శల సమ్మిళితమే ఊరు కవిత్వమని ప్రముఖ కవి, అనువాదకులు, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. ప్రముఖ కవి బీవీవీ.ప్రసాద్ రాసిన 'ఊరికే జీవితమై' కవితా సంపుటిని ఆదివారం రాత్రి ఖమ్మంలో ఆవిష్కరించారు. జాషువా వేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నర్సింహారెడ్డి మాట్లాడుతూ మట్టి వాసనలతో వెలువడిన అనేక కవితా సంపుటాలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయన్నారు. నిత్యం మానవ జీవన వేదనను తాత్వికంగా వాఖ్యానించడమే ప్రసాద్ ప్రత్యేకత అని తెలిపారు. కవి, అనువాదకులు ముక్కమాల చక్రధర్ మాట్లాడుతూ తెలియడంలో నుండి తెలియకపోవడంలోకి దూకాలంటూ ప్రసాద్ ఇచ్చిన ప్రేరణ ఎందరికో ఆదర్శమని చెప్పారు. అనంతరం ఇటీవల ఉగాది మహానంది జాతీయ పురస్కారాలు అందుకున్న కోమాకుల సీతారాములు, పంజాల ఐలయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు నామాడి శ్రీధర్, కట్టా శ్రీనివాస్, కొల్లు వెంకటేశ్వర్లు, అట్లూరి వెంకటరమణ, పగడిపల్లి వెంకటేశ్వర్లు, పురిమళ్ల సునంద, మేడగాని శేషగిరి, కన్నెగంటి వెంకటయ్య, ఎం.వీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. ఈనెల 18న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'నిరుద్యోగుల గోస – అఖిలపక్ష భరోసా' నిరసన దీక్షకు తరలిరావాలని కోరుతూ పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు ఆదివారం ఖమ్మంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆజాద్ మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల లీకేజీని నిలువరించేందుకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అఖిలపక్షం ఆధ్వర్యాన రాష్ట్రపతి, గవర్నర్‌కు లేఖ రాయనున్నామని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, చందు, కరుణ్, సాయి, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ జట్ల ఎంపిక పూర్తి



సబ్ జూనియర్, జూనియర్ బాలికల జట్లు



సబ్ జూనియర్, జూనియర్ బాలుర జట్లు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన చేపట్టిన జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల జట్లను ఎంపిక పోటీలు ఆదివారం ముగిశాయి. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు జిల్లావ్యాప్తంగా జూనియర్ విభాగంలో 30 మంది బాలబాలికలు, సబ్‌జూనియర్ విభాగంలో 24 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిన వారిని జాతీయ స్థాయి పోటీలకు వెళ్లే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.ఫణికుమార్, ఉపాధ్యక్షులు దీప్తి తెలిపారు. పోటీలను అఖిల్ కుమార్, మణిప్రీతి, కౌశిక్, ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

సింగరేణి ఆస్పత్రి ఆధునికీకరణకు రూ.10 కోట్లు

త్వరలోనే 30మంది స్పెషలిస్ట్ వైద్యుల నియామకం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ ఆస్పత్రి ఆధునికీకరణతో పాటు అత్యాధునిక పరికరాల కొనుగోలుకు రూ.10కోట్లు కేటాయించినట్లు సింగరేణి డైరెక్టర్(పా) ఎస్.బలరామ్ వెల్లడించారు. ఆస్పత్రిని ఈనెల 8న తాను తనిఖీ చేశానని తెలిపారు. ఈమేరకు సింగరేణి వ్యాప్తంగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు చికిత్స కోసం వచ్చే ఆస్పత్రిలో మరిన్ని ఆధునిక పరికరాలు కావాలని గుర్తించినట్లు చెప్పారు. దీంతో టూడీ ఎకో, తదితర పరీక్షల నిర్వహణకు పరికరాలు సమకూర్చనున్నామని తెలిపారు. అంతేకాక త్వరలోనే 30మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించనుండడంతో కార్మికులను రిఫర్ చేసే పని ఉండదని చెప్పారు. అలాగే, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్, వైద్య సంచాలకులతో చర్చించి కార్మికులకు నాణ్యమైన మందులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ వివరించారు. కాగా, ఆస్పత్రి ఆధునికీకరణ పనులు పూర్తయ్యాక నామమాత్రపు ఫీజుతో పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా వైద్యం అందించే ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నందున కార్మికులు ఇబ్బంది పడకుండా గనుల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ఆయన వెల్లడించారు.

ఆయిల్‌పామ్ సాగును పరిశీలించిన పాలమూరు రైతులు

అశ్వారావపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం, అచ్యుతాపురం, అల్లిగూడెంల్లో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలతో పాటు అశ్వారావుపేట సమీపాన పామాయిల్ ఫ్యాక్టరీని మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల రైతులు ఆదివారం పరిశీలించారు. అలాగే, నారంవారిగూడెం వద్ద ఆయిల్‌పామ్ నర్సరీని కూడా సందర్శించగా, మొక్కల పెంపకం, ఎరువుల వాడకం, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు, గెలల క్రషింగ్ వివరాలను ఆయిల్‌ఫెడ్ అధికారులు వివరించారు. అనంతరం దమ్మపేట మండలంలోని అప్పారావుపేటలోని ఫ్యాక్టరీని కూడా పరిశీలించిన వారు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఈ కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

చింతకాని: ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అవలంబిస్తూ చిరుధాన్యాల సాగుపై రైతులు మొగ్గుచూపాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి కోరారు. మండలంలోని కోమట్లగూడెంలో ఆదివారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎరువులు, పురుగు మందులు అధికంగా వినియోగిస్తున్నందున ప్రజల ఆరోగ్యం, పర్యావరణానికి నష్టం కలుగుతోందని తెలిపారు. ఈక్రమంలో కేంద్రప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోందని చెప్పారు. గోఆధారిత వ్యవసాయం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను సమాజానికి అందిస్తే ఆరోగ్యకరమైన భారతావనిని నిర్మించవచ్చని తెలిపారు. బీజేపీ మధిర అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావుతో పాటు ఆలస్యం వీరప్రసాద్, పంది కృష్ణయ్య, కోట సికిందర్, కొండా గోపి, వెంకన్న, పులి పాటి ప్రవీణ్, శివ, విజయ్, ప్రణీత్ రెడ్డి, సాంబశివరావు, రమేష్, రాము పాల్గొన్నారు.